# మరోసారి ఆశీర్వదించండి..



బాబాపూర్‌లో మాట్లాడుతున్న వేముల ప్రశాంత్‌రెడ్డి

- మరో ఐదేండ్లు ప్రజల కోసం కష్టపడి పని చేస్తా..
- కర్ణాటకలో నాలుగువేల రూపాయల పింఛన్ ఇవ్వనోళ్లు.. తెలంగాణలో ఎలా ఇస్తారు..?
- కాంగ్రెస్ పార్టీ కపట మాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దు
- నిత్యావసర ధరలు పెంచి సామాన్యుల నడ్డివిరిచిన మోదీ ప్రభుత్వం
- ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్/వేల్పూర్, నవంబర్ 7: తనను మరోసారి ఆశీర్వదిస్తే మరో ఐదేండ్లు ప్రజల కోసం కష్టపడి పని చేస్తానని బాల్కొండ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటకలో అమలుకు నోచుకోని పథకాలు తెలంగాణలో ఇస్తామనం విడ్డూరంగా ఉందన్నారు. ఆ పార్టీ మాయ మాటలను ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. మంగళవారం ఆయన వేల్పూర్, భీమ్‌గల్ మండలాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉదయం వేల్పూర్ మండలం కుకునూర్, కోమన్‌పల్లి, వెంకటాపూర్, సాయంత్రం భీమ్‌గల్ మండలంలోని బాబానగర్, బాబాపూర్, పురాణీపేట్ గ్రామాల్లో పర్యటించారు. మంత్రికి ఆయా గ్రామాల్లో బోనాలు, మంగళహారతులతో మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వేముల మాట్లాడుతూ.. వేల్పూర్ మండలంలోని కుకునూర్, కోమన్‌పల్లి, వెంకటాపూర్ గ్రామాలతో తనకు అవినాభావ సంబంధం ఉన్నదని, తన తండ్రి వేముల సురేందర్‌రెడ్డి ఈ గ్రామాల్లో ప్రతి ఇంటి వారిని పేరు పెట్టి పిలిచేంత ఆత్మీయ సంబంధాలు ఉండేవని గుర్తుచేశారు. రైతుబంధు, కల్యాణలక్ష్మి వంటి పథకాలను కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇవ్వలేదని, ప్రస్తుతం అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా ఇవ్వడం లేదన్నారు. కర్ణాటకలో రూ. 700 పింఛన్ ఇస్తున్న కాంగ్రెస్ పార్టీ..తెలంగాణలో రూ. నాలుగు వేలు ఇస్తామంటే ఎవరు నమ్ముతారని ప్రశ్నించారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కర్ణాటకలో ఎందుకు లేవో ప్రజలు ఆలోచించాలని కోరారు. తాను చెప్పేది అబద్ధమైతే అంబేద్కర్ విగ్రహం సాక్షిగా ముక్కు నేలకు రాస్తానన్నారు. మోదీ ప్రధాని అయిన తర్వాత 400 రూపాయలు ఉన్న గ్యాస్ సిలిండర్ ధర 1250 రూపాయలకు పెంచారని విమర్శించారు. కేసీఆర్ సీఎం అయ్యాక నాలుగు వందలకే సిలిండర్ అందజేస్తారని, మిగిలిన డబ్బులను మోదీ సర్కారుకు కేసీఆర్ ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. సీఎంఆర్‌ఎఫ్ సాయం వందలాది మందికి అందించామని, పీఎంఆర్‌ఎఫ్ నుంచి బీజేపీ ఎంపీ అర్వింద్ ఎంతమందికి ఎంత డబ్బు ఇప్పించారో చెప్పాలన్నారు. గుడ్డిగా బీజేపీ మాయ మాటలకు లోను కావద్దని యువతకు పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ సహకారంతో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రిగా తాను చేసిన అభివృద్ధి పనులు చిరస్థాయిగా నిలిచిపోయి, తరతరాలకు ఉపయోగపడుతాయన్నారు. బాల్కొండ నియోజకవర్గాన్ని పచ్చగా ఉంచుతానని అన్నారు. ప్రచారంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సయ్య, కమ్మర్‌పల్లి ఏఎంసీ చైర్మన్ గుణ్‌వీర్‌రెడ్డి, ఎంపీపీ మహేశ్, జడ్పీటీసీ రవి, సర్పంచులు రాము లు, అతీఖ్, శంకర్, ఎంపీటీసీలు సుర్జీల్, సాయి ప్రసన్న, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వేములకు బోనాలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

## అమర జవాన్ మహేశ్‌కు మంత్రి నివాళి



జవాన్ మహేశ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వేముల

వేల్పూర్, నవంబర్ 7 : ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలం లోని కోమన్‌పల్లి గ్రామంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా వీరమరణం పొందిన జవాన్ ర్యాడ మహేశ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

### నేడు కమ్మర్‌పల్లి, మోర్తాడ్‌లో ప్రచారం

వేల్పూర్, నవంబర్ 7 : బాల్కొండ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డి కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాల్లో బుధవారం పర్యటించనున్నారు. కమ్మర్‌పల్లి మండలం అమీర్‌నగర్‌లో ఉదయం 8.30 గంటలకు, 10.30 గంటలకు ఇనాయత్‌నగర్, 11.30 గంటలకు నర్సాపూర్, 4 గంటలకు మోర్తాడ్ మండలం శెట్‌పల్లి, 6 గంటలకు ధర్మోరా, 7 గంటలకు దోన్కల్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు.

# గడప గడపకూ బీఆర్‌ఎస్

- వేములకు మద్దతుగా జోరుగా ప్రచారం
- పార్టీ మ్యానిఫెస్టోను వివరిస్తున్న నాయకులు
- కారు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి



ముప్కాల్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కమ్మర్‌పల్లి/ముప్కాల్/ మెండోరా/ ఏర్గట్ల/ బాల్కొండ/ మోర్తాడ్, నవంబర్ 7 : బాల్కొండ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ముమ్మరంగా ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తున్నాయి. పార్టీ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా గ్రామాలు, బూత్ స్థాయిల్లో ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ ప్రభుత్వం, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. తెలంగాణ రాక ముందు, రాష్ట్రం వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధిని గుర్తించి, కారుకు ఓటు వేసి ప్రశాంత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఎన్నికల మ్యానిఫెస్టోలోని అంశాలను వివరించారు.

ముప్కాల్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. వేముల ప్రశాంత్‌రెడ్డికే ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సామ వెంకట్ రెడ్డి, మున్నా, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెండోరా మండలంలోని గ్రామగ్రామాన బీఆర్‌ఎస్ శ్రేణులు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. మండలంలోని పోచంపాడ్, సోన్‌పేట్, దూద్‌గాం గ్రామాల్లో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి మహిళలు, ప్రజలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, సర్పంచులు గోపిడి గంగారెడ్డి, మిస్బా, నాయకులు పాల్గొన్నారు.

ఏర్గట్ల మండలంలోని ఎనిమిది గ్రామాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోతోపాటు సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో మంత్రి వేముల చేసిన అభివృద్ధి పనుల ను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎనుగందుల రాజపూర్ణనందం ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి మంత్రి వేములను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

బాల్కొండ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో వేముల ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుప్పాల విద్యాసాగర్ ప్రచారం చేస్తున్నారు. మంగళవారం అంబేద్కర్‌నగర్ కాలనీ, వినాయక్‌నగర్ కాలనీలో ఇంటింటికీ వెళ్లి మంత్రి వేముల చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రచారంలో ఎస్సీ విభాగం మండల అధ్యక్షుడు ద్యావతి రాజు, ఎస్సీ విభాగం గ్రామశాఖ అధ్యక్షుడు పిట్ల దయాకర్, నాయకులు నల్ల తిరుపతి, మోతె మహేశ్ పాల్గొన్నారు.

మోర్తాడ్ మండలంలో బీఆర్‌ఎస్ ప్రచారం ఊపందుకున్నది. ప్రతి గ్రామంలో బీఆర్‌ఎస్ శ్రేణులు గడపగడపకూ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి.



మోర్తాడ్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్‌లో ఇంటింటా ప్రచారం చేస్తున్న సర్పంచ్ సక్కారం అశోక్, నాయకులు



బాల్కొండలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి, కార్యకర్తలు

# గల్ఫ్ బాధితులకు సంక్షేమ పథకాలు

**బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కోటపాటి నర్సింహనాయుడు**



పోచంపాడ్‌లో గల్ఫ్‌బాధితులతో సమావేశమైన కోటపాటి

మెండోరా, నవంబర్ 7 : విదేశాలకు జీవనోపాధి కోసం వెళ్లి, తిరిగి వచ్చి ఉపాధి లేకుండా ఉన్న వారికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందని పార్టీ రైతువిభాగం రాష్ట్ర నాయకుడు కోటపాటి నర్సింహనాయుడు అన్నారు. మండలంలోని దూద్‌గాం, నెహ్రూనగర్, పోచంపాడ్, సోన్‌పేట్ గ్రామాల్లో మంగళవారం ఆయన గల్ఫ్ బాధితులతో సమావేశమయ్యారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డికే ఓటు వేయాలని కోరారు. కారు గుర్తుకే ఓటు వేస్తామని గల్ఫ్ బాధితులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. సమావేశంలో సర్పంచులు అనసూయా మహేందర్, గోలి ప్రకాశ్, పసుల శ్రీనివాస్, మిస్బా తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల కోసం 'తొలిమెట్టు'

మోర్తాడ్, నవంబర్7: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ పెద్దన్న ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రాథమిక స్థాయిలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఈకార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా శిక్షణ పొందిన డిగ్రీ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బోధించాల్సి ఉంటుందని చెప్పారు. విద్యార్థులంతా తమ బాధ్యతను సక్రమంగా నిర్వహించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి భూపతి, అధ్యాపకులు పాల్గొన్నారు.